# పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి పరిష్కారం పొందండి

## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 23 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ప్రతీ సోమవారం జిల్లా, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు.పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. మీ కోసం వెబ్ సైట్ లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# డిగ్రీ ఒక తలుపు మాత్రమేనైపుణ్యంతోనే విజయం మంత్రి డా. పెమ్మసాని



**గుంటూరు , పెన్ పవర్,ఆగస్టు 23:**
డిగ్రీ ఒక తలుపు మాత్రమేనని.. జీవితంలో విజయాన్ని సాధించాలంటే నైపుణ్యం, పట్టుదల, క్రమశిక్షణ, నిబద్ధత అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.గీతం విశ్వవిద్యాలయం 17వ స్నాతకోత్సవంలో ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పట్టాలు అందుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి సాంకేతికతలతో వేగంగా మార్పులు వస్తున్నాయని, మార్పులకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలు నేర్చుకునే వారే ముందుకు వెళ్తారని చెప్పారు.విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా.. సమస్యలకు పరిష్కారాలు చూపుతూ ఉద్యోగాలు కల్పించే వారిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఒక రంగంలో లోతైన, ఆచరణాత్మక పరిజ్ఞానం సాధించాలని సూచించారు.వైఫల్యాలకు భయపడకుండా ప్రయత్నిస్తూ, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. గొప్ప విజయాలకు సులభమైన మార్గాలు ఉండవని, కృషి, సహనం, పట్టుదలతోనే లక్ష్యాలను సాధించగలమని తెలిపారు.
కెరీర్‌తో పాటు ఆరోగ్యం, వ్యాయామం, మంచి ఆహారం, మంచి స్నేహ సంబంధాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిజాయితీ, బాధ్యత, ఇతరులను గౌరవించడం వంటి మంచి వ్యక్తిత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు డా. పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.భారతదేశ అభివృద్ధిలో యువత తమ నైపుణ్యాలతో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.



# పాత గుంటూరులో ఘనంగా “మన ఊరుమన జెండా” కార్యక్రమం



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 23,**
పాత గుంటూరు శుద్ధపల్లి డొంక మూడో లైన్ మెయిన్ రోడ్డులో భారతీయ జనతా పార్టీ 12వ మండల అధ్యక్షులు ముప్వ సురేష్, మండల కమిటీ ఆధ్వర్యంలో “మన ఊరుమన జెండా” కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ వై. దొరబాబు, మండల ఇన్‌చార్జ్ డాక్టర్ రాధామాధవి, కొత్తూరు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ వై. దొరబాబు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో “మన ఊరుమన జెండా” కార్యక్రమం ద్వారా జాతీయ జెండాను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జెండా వద్ద స్కానర్‌ను ఏర్పాటు చేసి, దానిని స్కాన్ చేయడం ద్వారా ఆయా డివిజన్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మొబైల్ ఫోన్ ద్వారా తెలుసుకునేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.
అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లా నాగేశ్వరరావు, బి. రామకృష్ణ, శంకర్, చింతపల్లి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సాదు రామకృష్ణ, కార్యదర్శి సురేష్ కుమార్ జైన్, పలకలూరు శ్రీనివాస్, షేక్ రఫీ, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఫైరోజ్ ఖాన్, షేక్ హజరత్ అలీ, బాలాజీ, భార్గవ్ రామారావు, కామేపల్లి వెంకటేశ్వరరావు, కారుణ్యతో పాటు పలువురు జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒంటరి వృద్ధుడిపై దాడి..

## బంగారం, నగదు దోపిడీ పొన్నూరు టౌన్ పోలీసులు






**గుంటూరు , పెన్ పవర్ ఆగస్టు 23,**
ఒంటరిగా నివసిస్తున్న 76 ఏళ్ల వృద్ధుడిపై దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు దోచుకున్న మహిళను పొన్నూరు టౌన్ పోలీసులు 36 గంటల్లోనే అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన గడ్డం రత్తయ్య ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. గతంలో ఆయన పొలంలో పనిచేసిన మినిగల సువర్ణ ఏ సూరమ్మ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఇంట్లోకి ప్రవేశించింది. ఎవరూ లేని సమయంలో రత్తయ్య కళ్లలో కారం కొట్టి, దాడి చేసి బీరువాలోని బంగారు ఆభరణాలు, రూ.5,500 నగదును దోచుకుని పరారైంది.
గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, తెనాలి డీఎస్పీ బి. జనార్ధనరావు పర్యవేక్షణలో పొన్నూరు టౌన్ సీఐ ఆర్.ఎస్. కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసి నిందితురాలిని అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి నాలుగు బంగారు గాజులు, రెండు జతల చెవి ఆభరణాలు, రెండు ఉంగరాలు, రూ.5,500 నగదును పూర్తిగా రికవరీ చేశారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఒంటరిగా నివసించే వృద్ధులు అపరిచితులను ఇంట్లోకి అనుమతించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# చీరాలలో ఘనంగా సహస్ర గళ భగవద్గీత పారాయణం

**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 23:**
చీరాల ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ గ్రౌండ్‌లో విశ్వహిందూ పరిషత్ చీరాల శాఖ ఆధ్వర్యంలో కోటి సంపూర్ణ భగవద్గీత పారాయణ మహాయజ్ఞంలో భాగంగా సహస్ర గళ భగవద్గీత పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1008 మంది భాగవతులు సామూహికంగా భగవద్గీత పారాయణం చేశారు.కార్యక్రమానికి చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య గారు హాజరై భగవద్గీత పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవద్గీత బోధనలు మానవ జీవితానికి మార్గదర్శకమని, ప్రతి ఒక్కరూ గీతా సారాన్ని తెలుసుకుని తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు.కోటి సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం సనాతన ధర్మ విజ్ఞాన ప్రవాహంలో ఒక అద్భుత ఘట్టమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మహాయజ్ఞం ఏ ఒక్కరి వ్యక్తిగత శ్రమతో సాధ్యమైనది కాదని, దైవ సంకల్పంతోనే ఇంతటి బృహత్తర కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు.పూజ్య గురుదేవులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య సంకల్పం, వజ్రసంకల్పమే ఈ కార్యక్రమానికి ప్రధాన చోదక శక్తిగా నిలిచిందన్నారు. భగవద్గీతలోని “మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్” అనే ఉక్తికి సజీవ రూపంగా వేలాది మంది భక్తులు ఏకతాభావంతో గీతా పారాయణంలో పాల్గొన్నారని తెలిపారు.గురుభక్తికి దైవశక్తి తోడైతే సాధించలేనిది ఏదీ లేదని ఈ మహాయజ్ఞం మరోసారి నిరూపించిందన్నారు. పూజ్య స్వామీజీ వారి దివ్య సంకల్ప బలంతో కొనసాగుతున్న కోటి సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం విశ్వశాంతికి, ధర్మ రక్షణకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.



# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## నూతన గోదాం ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



**చీరాల, పెన్ పవర్,ఆగస్టు 23:**
రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. తోటవారిపాలెం గ్రామంలో చీరాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన గోదాం, అలాగే పాత గోదాం పునర్నిర్మాణ పనులను పూర్తి చేసి ఏర్పాటు చేసిన గోదాం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు పంటల సాగుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యంతో పాటు ఎరువులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు గోదాం నిర్మించడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో చీరాల పిఎసిఎస్ అధ్యక్షులు కోటి మోహన్ కృష్ణ, బాపట్ల జిల్లా సహాయక అధికారి కె.యల్లమందరావు, పిడిసిసి ఒంగోలు కామేపల్లి సీతారామయ్య, సిఇఓ పిడిసిసి ఒంగోలు కె.లక్ష్మీనారాయణ, డీజీఎం పి డి సి సి ఒంగోలు, చీరాల నోడల్ ఆఫీసర్ వై. ప్రకాశ్, ఎయంసి చీరాల ఛైర్మన్ కౌతరపు జనార్ధన్, కాళహస్తి బోర్డు మెంబర్ కొమ్మనబోయిన రజిని, పందిళ్లపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు పల్లప్రోలు శ్రీనివాసరావు, అధికారులు, వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

# ఘనంగా నిర్వహణ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 23:**
గుంటూరు కలెక్టరేట్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్గా భాయి, కలెక్టరేట్ ఏఓ మల్లీశ్వరి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీఆర్ఓ ఖాజావలి మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, ప్రజా నాయకుడిగా దేశానికి, రాష్ట్రానికి విశిష్ట సేవలందించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ధైర్యసాహసాలతో పాల్గొని ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు.బ్రిటిష్ సైనికులు తుపాకులు గురిపెట్టినా వెనుకడుగు వేయకుండా తన గుండె చూపించి నిలబడిన ధైర్యానికి గుర్తుగా ఆయనకు ‘ఆంధ్రకేసరి’ అనే బిరుదు లభించిందన్నారు. ప్రజల హక్కులు, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కూడా ప్రజలకు సేవలందించిన ఆయన పరిపాలనా దక్షత, ప్రజాసేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు.టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని డీఆర్ఓ పిలుపునిచ్చారు. దేశం కోసం, ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

# నిరాడంబరత, ధైర్యం, పట్టుదలకు ప్రతీక

## ప్రకాశం పంతులు : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 23,**
నిరాడంబరత, నిజాయితీ, పట్టుదల, క్రమశిక్షణ, ధైర్యసాహసాలకు ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులుగారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన మహోన్నత వ్యక్తి ప్రకాశం పంతులు అని కొనియాడారు.స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ పాలకుల ఎదుట నిర్భయంగా నిలిచి, తన సాహసాన్ని చాటుకున్న ప్రకాశం పంతులు తెలుగువారి ధైర్యసాహసాలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే పెద్దపీట వేసిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

# గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కానిస్టేబుళ్లపై దాడి

**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 23,**
గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి కానిస్టేబుళ్లపై జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ సీతారాం తెలిపారు. కానిస్టేబుళ్లు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగానే కేసు నమోదు చేశామని, ఈ విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదని స్పష్టం చేశారు.మరో వర్గం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని తెలిపారు. నిందితులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, దాడికి పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ సీతారాం వెల్లడించారు.



# చట్టం ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

## పట్టాభిపురం ఎస్‌హెచ్‌ఓ గంగా వెంకటేశ్వర్లు



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 23:**
రౌడీ కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, సేవనానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పట్టాభిపురం ఎస్‌హెచ్‌ఓ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు.గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం రౌడీ షీటర్లకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ కార్యక్రమంలో భాగంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సెలింగ్‌కు హాజరైన రౌడీ షీటర్లను ఉద్దేశించి ఎస్‌హెచ్‌ఓ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయం, సేవనం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని ఎస్‌హెచ్‌ఓ సూచించారు.

# తిరుమల శ్రీ వారిని దర్శించుకున్న

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 23,**
శ్రీ భ్రమర టౌన్ షిప్స్ అధినేత గళ్ళా రామచంద్రరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ప్రతి సంవత్సరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, గళ్ళా రామచంద్రరావు జన్మదినాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.

# ఉద్యోగుల ఉత్సాహానికి క్రీడలే ఊతం

## జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ,



**విజయవాడ, పెన్ పవర్ , ఆగస్టు 23:**
ఉద్యోగుల్లో ఆరోగ్యం, ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలకమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ అన్నారు.యునైటెడ్ తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పది జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ఏపీ ఎన్జీవో, ఎడ్యుకేషన్ జట్లు తలపడ్డాయి. ఇరు జట్లు 149 పరుగులు చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో ఏపీ ఎన్జీవో జట్టు విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడలు ఉద్యోగుల్లో ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంచడంతో పాటు టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు. ఉద్యోగులు విధులతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగుల్లో ఐక్యత, స్నేహభావాన్ని పెంచుతాయని, ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమానికి ఏపీ ఎన్జీవో సంఘం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్, యూటీజేఏ నిర్వాహకులు, ఏపీ ఎన్జీవో నాయకులు, ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్

## పేట టౌన్ ఎస్సై హాజరత్తయ్య హెచ్చరిక



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 23 :**
చిలకలూరిపేట : రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పేట పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు టౌన్ ఎస్సై హాజరత్తయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో పట్టణంలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరైనా గొడవలకు దిగినా, అసాంఘిక కార్యకలాపాలు లేదా నేరాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పద్ధతి మార్చుకోకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు పట్టణ బహిష్కరణ చేస్తామని గట్టిగా హెచ్చరించారు. పట్టణంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

# ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

## నివాళులు అర్పించిన పల్నాడు జిల్లా పోలీసులు




**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 23:**
ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన మహనీయ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాసేవకుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏ.ఆర్. డీఎస్పీ జి. మహాత్మా గాంధి, ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, 1872 ఆగస్టు 23న ప్రకాశం జిల్లా కనుపర్తి గ్రామంలో జన్మించిన టంగుటూరి ప్రకాశం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అపార ధైర్యసాహసాలతో విశిష్ట స్థానం సంపాదించారని తెలిపారు.టంగుటూరి ప్రకాశం కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాకుండా, న్యాయం, నిజాయితీ, సమానత్వం కోసం అహర్నిశలు కృషి చేసిన మహానాయకుడని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణలో ఆయన చూపిన ధైర్యం, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు.ప్రకాశం పంతులు 1953లో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారని, రైతుల సంక్షేమం, విద్యా అభివృద్ధి, పారిశ్రామిక రంగ ప్రగతికి అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. ఆయన జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితమైందని కొనియాడారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ చట్ట అమలుతో పాటు న్యాయం, సమానత్వం, ప్రజల పట్ల కరుణతో కూడిన సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని, నిజం కోసం నిలబడటమే గొప్ప ధైర్యమని ప్రకాశం పంతులు జీవితం మనకు బోధిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. గోపినాథ్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ ఆర్‌ఎంపీ అధ్యక్షుడు కొండిశెట్టి సురేష్, ఆధ్వర్యంలో

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు, 23,**
పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వంగవీటి ఆశాకిరణ్ అన్నారు.మచిలీపట్నంలోని జిల్లాకోర్టు సెంటర్‌లో ఉన్న సేవ్ హాస్పిటల్‌లో జాతీయ ఆర్ఎంపీ అసోసియేషన్, ఆర్ఎంపీడబ్ల్యూఏ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరానికి వంగవీటి ఆశాకిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ సందీప్ వేము, కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ మాదాసు తదితర వైద్య నిపుణులు సేవలు అందించారు.కంటి సమస్యలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. షుగర్, బీపీ పరీక్షలతో పాటు గుండె సంబంధిత సమస్యలను గుర్తించేందుకు ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్యం, శస్త్రచికిత్స అవసరాలను గుర్తించి, హాస్పిటల్‌లో ఉచిత చికిత్సతో పాటు మందులు అందజేశారు.కార్యక్రమంలో జాతీయ ఆర్ఎంపీ అధ్యక్షుడు కొండిశెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శి నర్రా సునీత, ఆర్ఎంపీడబ్ల్యూఏ ఏపీ అధ్యక్షుడు బి.ఆర్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే డా. బూర్లరామాంజనేయులు చేతుల మీదుగా

# శ్రీ దుర్గా మల్లేశ్వర హోటల్ ఘనంగా ప్రారంభం

**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 23:**
గుంటూరు కన్నావారితోట 6వ లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా మల్లేశ్వర హోటల్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సేవలు అందిస్తూ హోటల్ మంచి ఆదరణ పొందాలని, వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, హోటల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.





# అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు, 23,**
మనిషికి అన్నింటికంటే నయనం ప్రధానమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ అన్నారు. ఆదివారం అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో శంకర ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వృద్ధులకు ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. శుక్లాలు, కంటిలో పొర వంటి సమస్యలతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యార్థులు సైతం చిన్న వయసులోనే కంటి చూపు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు మొబైల్స్, టీవీలకు దూరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మొబైల్స్ పిల్లల ప్రగతికి ఉపయోగపడాలన్నారు. సెల్ ఫోన్లు చూడటం కారణంగా కంటిచూపుపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు ఉచిత కంటి వైద్య శిబిరంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని అన్నారు.



# శివకుటుంబం నుంచి పెట్లూరివారిపాలెం వరకు రహదారి అభివృద్ధి

## - రూ.3.50 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన

## - నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 23:**
నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ శివకుటుంబం నుంచి పెట్లూరివారిపాలెం గ్రామంలోని వినుకొండ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణ పనులకు రూ.3.50 కోట్ల వ్యయం చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శివకుటుంబం నుంచి పెట్లూరివారిపాలెం వరకు రహదారి అభివృద్ధి పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు పరిసర గ్రామాలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రహదారి నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# దాతల చేయూతను సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 23,**
విద్యార్థులు ఎప్పటికప్పుడు దాతలు అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక ఆర్ అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. వాసవి మిత్ర మండలి అధ్యక్షుడు అన్న పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వాసవి మిత్ర మండలి వారు విద్యార్థులకు ఉచిత సేవలు అందించటం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థానంలో నిలిచినప్పుడు సమాజానికి తమ వంతు సహకారం అందించాలని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస్తువులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖర్ రావు, కోశాధికారి త్రిపురమల్లు అశోక్ కుమార్, సేవాకమిటి చైర్మన్ కొరళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో ఆరోపణలు చేయొద్దు పాత గుంటూరు పోలీసులు



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 23:**
గుజ్జనగుండ్లకు చెందిన 27 ఏళ్ల యువతి షేక్ కరీంబేగం వివాహ నిశ్చితార్థం రద్దు కావడం, తనపై మరియు కుటుంబ సభ్యులపై కేసులు నమోదవడంతో తీవ్ర మనస్తాపానికి గురై జూలై 19న ఎలుకల మందు సేవించినట్లు పోలీసులు తెలిపారు. ఆమెను గుజ్జనగుండ్ల జేకేసీ రోడ్డులోని శ్రేష్ట హాస్పిటల్‌కు తరలించగా, ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం.. కరీంబేగం, పొత్తూరివారి తోటకు చెందిన బాబావలి మధ్య మే 29న నిశ్చితార్థం జరిగింది. ఈ సందర్భంగా వధువు కుటుంబం రూ.5 లక్షలు కట్నంగా అడ్వాన్స్‌గా చెల్లించినట్లు పేర్కొన్నారు. అనంతరం వివాహ విషయమై ఇరు కుటుంబాల మధ్య వివాదం ఏర్పడింది.బాబావలికి మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందంటూ కరీంబేగం కుటుంబ సభ్యులు ఆరోపించడంతో వివాదం మరింత ముదిరినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో పరస్పర కేసులు నమోదయ్యాయి. క్రైం నంబర్లు 172/2026, 173/2026 కింద దీచీలోని పలు సెక్షన్లతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.అదేవిధంగా కరీంబేగం, ఆమె తల్లి మల్లిక ఫిర్యాదు మేరకు బాబావలి వివాహం చేసుకుంటానని నమ్మించి కట్నం పేరుతో డబ్బు, బంగారం తీసుకుని మోసం చేశాడనే ఆరోపణలపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.755/2026 ఖ/o 318(4) దీచీా కింద కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయి చార్జిషీట్ దాఖలు చేసే ప్రక్రియలో ఉన్నట్లు పేర్కొన్నారు.మరోవైపు బాబావలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్‌లోనూ విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఇరు వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై నిబంధనల ప్రకారం దర్యాప్తు చేస్తున్నామని, పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, జూలై 29న బాబావలి తల్లి నిద్రమాత్రలు సేవించిన ఘటనపై కూడా పోలీసులు స్పందించారు. ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ఎంఎల్‌సీ ఆధారంగా వాంగ్మూలాన్ని నమోదు చేసి జనరల్ డైరీలో నమోదు చేసినట్లు వెల్లడించారు.వివాహ వివాదానికి సంబంధించిన అంశాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని, సోషల్ మీడియాలో పరస్పరం ఆరోపణలు, తప్పుడు సమాచార ప్రచారాలకు పాల్పడకుండా చట్టపరమైన మార్గాలను ఆశ్రయించాలని పోలీసులు సూచించారు.

# చదరంగం కదిలింది.. బాల మేధస్సు వెలిగింది జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 23,**
రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ అమరావతి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సమన్వయంతో పాఠశాల స్థాయి బాలబాలికల కోసం ఒకరోజు రాపిడ్ చెస్ టోర్నమెంట్‌ను జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ అమరావతి చార్టర్ ప్రెసిడెంట్ డా. కొడాలి వల్లి, చార్టర్ సెక్రటరీ డా. హిమబిందు, డా. ఐశ్వర్య యలమంచిలి చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.ఈ పోటీని మొత్తం 7 రౌండ్లలో నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 200 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ చెస్ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలో మొత్తం 25 బహుమతులతో పాటు నగదు బహుమతులు విజేతలకు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందించారు.సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముఖ్య



అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను ఎంతో ఓర్పుతో చెస్ పోటీలకు తీసుకువచ్చిన తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఏకాగ్రత, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించడంలో చెస్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందడుగు వేసిన రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ అమరావతి బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఓపెన్ కేటగిరీలో ప్రథమ బహుమతి: విజ్జి హేమంత్ కుమార్, ద్వితీయ బహుమతి: గాజుల మేఘశ్యాం సాయి, తృతీయ బహుమతి: నందగోపాల్ సాధించారు. అంతర్జాతీయ రేటెడ్ చెస్ కోచ్‌లు కె.సురేష్, యు.దాసు టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డా. రామ్ చంద్, పి. అప్పారావు, శివ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి తమ సేవలను అందించారు.పాఠశాల స్థాయి విద్యార్థుల్లో చెస్ క్రీడపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి మేధో సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# పేద విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్న ఐవీఎం సురేష్ ప్రశంసనీయులు

- అవనిగడ్డ టిడిపి ఇన్చార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు
- 320 మంది విద్యార్థులకు రూ.70లక్షల సహాయం చేసిన ఐవీఎం సురేష్-రోజా
- 14మంది బీ.టెక్ విద్యార్థులకు లాప్ టాప్స్ సహాయం

**చల్లపల్లి పెన్ పవర్ ఆగస్టు 23**
పేదరిక నిర్మూలన ధ్యేయంగా నిరుపేద ప్రతిభావంతులకు ప్రతి ఏటా ఉపకార వేతనాలు అందిస్తున్న ఐవీఎం సురేష్ ప్రశంసనీయులు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య) అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలోని ఐవీఎం కార్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇండీ విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్- రోజా దంపతుల ఆధ్వర్యంలో రూ.70లక్షలు వ్యయంతో రాష్ట్రంలోని పలు కళాశాలలు, యూనివర్సిటీల్లో ఇంటర్, డిగ్రీ, బీ.టెక్, మెడిసిన్, పీజీ చదువుతున్న 140మంది విద్యార్థులకు, పాఠశాలల్లో చదువుతున్న 180మంది హైస్కూల్ స్థాయి విద్యార్థులకు ఉపకార వేతనాలు, 14మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు లాప్ టాప్స్ అందచేశారు.ముఖ్య అతిధిగా విచ్చేసిన కొనకళ్ళ బుల్లయ్య మాట్లాడుతూ దానగుణంలో కర్ణుడు, శిబి చక్రవర్తి స్ఫూర్తిప్రదాతలు అన్నారు. దానగుణం కలిగిన వారిని చూసి లక్ష్మీదేవి సంతోషపడుతుందన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని గుర్తించి, దశాబ్దాలుగా నిరుపేద ప్రతిభావంతులను గుర్తించి వారి విద్యాభివృద్ధికి ఆర్థిక సహాయం అందిస్తున్న సురేష్-రోజా దంపతులు స్ఫూర్తిప్రదాతలు అన్నారు. పేదరిక నిర్మూలన కోసం అన్ని మతాలు కృషి చేశాయని తెలిపారు. పేదలకు సహాయం చేయడంలో కలిగే సంతృప్తి అనిర్వచనం అన్నారు.రాష్ట్ర అగ్నికుల క్షత్రియ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ సేవా గుణం కలిగిన సురేష్-రోజా దంపతుల సేవలు ప్రశంసనీయం అన్నారు. దేవుని ప్రేరణతో నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న తీరు ఆదర్శనీయం అన్నారు. ఐవీఎం సురేష్ అందిస్తున్న సహాయాన్ని ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. తద్వారా తాము కూడా మరింత మంది పేద విద్యార్థులను ఆదుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా నిరుపేదల విద్యా సేవలో తరిస్తున్న సురేష్- రోజా దంపతుల సహాయంతో వందలాది మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవటం శుభ పరిణామం అన్నారు. ఇంత గొప్ప సేవా సంస్థ చల్లపల్లి ప్రాంతంలో ఉండటం గర్వదాయకం అన్నారు.టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ వేములపల్లి సురేష్ యూకేలో ఉద్యోగం వదిలి తన సొంత గ్రామానికి వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కుటుంబం మొత్తం సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల వేములపల్లి సురేష్- రోజా దంపతుల సేవలను కొనియాడారు. ఎంతో మంది ఇంజనీర్లను, డాక్టర్లను చేసిన ఘనత సురేష్ దంపతులదేనన్నారు. వేములపల్లి సురేష్ ను ఆదర్శంగా తీసుకొని, ఆయన సహకారంతో ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులు భవిష్యత్తులో సేవా దృక్పథంతో తోటి వారికి చేయూతనందించాలని విద్యార్థులకు సూచించారు.ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని గుర్తించి తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించే కార్యక్రమానికి అత్యధిక ప్రాముఖ్యత ఇస్తున్నట్లు తెలిపారు. సరైన విద్యా అవకాశాలు పొందలేక నిరక్షరాస్యులుగా





మిగిలి కార్మికులుగా కర్షకులుగా శ్రామికులుగా మిగిలిన వారి పిల్లలు ఉన్నత విద్యావంతులు కావాలనే లక్ష్యంతో ఈ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భావితరాలైన నేటి విద్యార్థులు ఉన్నత విద్యావంతులై ఉత్తమ స్థాయికి చేరుకోవాలన్నదే తమ సంస్థ ధ్యేయం అన్నారు. దేవుని కృపతో ఈ ఏడాది పేద విద్యార్థులకు రూ.70లక్షలు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి సీఐ కే.ఈశ్వరరావు, దివి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఘంటసాల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, విశ్రాంత డీఎస్పి హరిరాజేంద్ర బాబు, ఏపీపీ కర్రా సుధాకర్, చల్లపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులు మోర్ల రాంబాబు, చల్లపల్లి పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ (నానీ) నారా లోకేష్ సేవాసమితి అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎస్ఐ డీ.దుర్గాంజనేయులు, డాక్టర్ జయప్రసాద్, హనుమానుల సురేంద్రనాధ్ బెనర్జీ, విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు, ఐవీఎం ట్రస్టీలు గంటా ప్రసాద్, నాదెళ్ల ఫణి, వేములపల్లి విజయ, వేములపల్లి సోఫీ, సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితురాలికి ప్లేట్‌లెట్స్ దానం చేసి నిండు ప్రాణాన్ని కాపాడిన కస్తూరి విజయ్ కుమార్



**చల్లపల్లి పెన్ పవర్ ఆగస్టు 23**
ఆపదలో ఉన్నామన్న ఒక్క పిలుపు వస్తే చాలు, సమయం సందర్భం చూడకుండా ముందుకొచ్చే సేవాతత్పరత ఆయన సొంతం. అవనిగడ్డ నియోజకవర్గంలో రక్తదాన ఉద్యమానికి చిరునామాగా నిలిచి, ఇప్పటికే రికార్డు స్థాయిలో 81 సార్లు రక్తదానం చేసిన ప్రముఖ రక్తదాత కస్తూరి విజయ్ కుమార్ తాజాగా మరోసారి తన మానవతా దృక్పథాన్ని ఘనంగా చాటుకున్నారు. ఈరోజు తన 82వ సారి రక్తదానం చేశారు.
విజయవాడలోని ప్రఖ్యాత నాగార్జున హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న స్నేహ అనే క్యాన్సర్ బాధితురాలి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో, ఆమెకు అత్యవసరంగా రక్తంలోని ప్లేట్‌లెట్స్ అవసరమయ్యాయి. సమయానికి ప్లేట్‌లెట్స్ అందకపోతే ప్రాణాపాయం పొంచి ఉండటంతో, తీవ్ర ఆందోళనకు గురైన బాధితురాలి కుటుంబ సభ్యులు “మన అవనిగడ్డ బ్లడ్ డోనార్స్” వాట్సాప్ గ్రూప్ నిర్వాహకులను సంప్రదించి సహాయం కోరారు.
ఈ సమాచారం అందిన వెంటనే కస్తూరి విజయ్ కుమార్ ఏమాత్రం ఆలోచించకుండా తక్షణమే స్పందించారు. స్పందించి వెంటనే చల్లపల్లి నుంచి అత్యవసరంగా విజయవాడ ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం క్యాన్సర్ బాధితురాలికి స్వయంగా సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్డీపీ) దానం చేసి, ఆమె ప్రాణాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు.
రక్తదానం అంటే కేవలం దానం మాత్రమే కాదని, అది ఒక కుటుంబానికి ఇచ్చే పునర్జన్మ అని ఆయన ఈ సందర్భంగా నిరూపించారు. ఆపత్కాలంలో స్పందించి ప్రాణదాతగా నిలిచిన విజయ్ కుమార్‌కు బాధితురాలి బంధువులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. సేవాగుణం మాటలకే పరిమితం కాకూడదని చేతల్లో నిరూపిస్తున్న విజయ్ కుమార్ సేవా నిరతి నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమని స్థానికులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొనియాడారు.

# వీఆర్వో సంతకం ఫోర్జరీ: నిందితుడిపై కేసు నమోదు



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 23 :**
నాదెండ్ల : నూతన గృహ నిర్మాణ రుణం కోసం ప్రభుత్వ ధ్రువీకరణ పత్రంపై వీఆర్వో సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన నాదెండ్ల మండలంలో కలకలం రేపింది. మండల పరిధికి చెందిన ఎలీషాబాబు అనే వ్యక్తి కొత్త ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు లోన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రక్రియలో భాగంగా సమర్పించాల్సిన పత్రంపై నాదెండ్ల వీఆర్వో అబ్దుల్ బాషా సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంకు అధికారులకు సమర్పించాడు. సదరు ధ్రువీకరణ పత్రంపై అనుమానం వచ్చిన బ్యాంకు సిబ్బంది వెంటనే వీఆర్వోను సంప్రదించి ఆరా తీయగా, తాను ఆ పత్రంపై సంతకం చేయలేదని స్పష్టం చేయడంతో ఫోర్జరీ బాగోతం వెలుగులోకి వచ్చింది. వీఆర్వో అబ్దుల్ బాషా ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఎలీషాబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని అబ్బాస్ నగర్ మసీదు వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు




**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 23 :**
చిలకలూరిపేట : పట్టణంలోని మానుకొండవారిపాలెం మార్గంలో ఉన్న అబ్బాస్ నగర్ మసీదు వద్ద ముస్లిం భక్తులు సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని ఆకాంక్షిస్తూ అల్లాను వేడుకున్నారు. హుడా సొసైటీ అబ్బాస్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లిం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు గంటపాటు ఈ సామూహిక ప్రార్థనలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో లక్కీ రోడ్ లైన్స్ యూసఫ్ అలీ, అనాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ మహిళా కమిషన్‌కు పరిస్థితిపై భరోసా కల్పిస్తున్న

# ఏపీ మహిళా కమిషన్ రాయపాటి శైలజ






**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 23:**
కాకినాడలో నర్సింగ్ విద్యార్థినులకు సంబంధించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ స్పందించింది. ఘటనకు సంబంధించిన వివరాలను కమిషన్ ఆరా తీస్తూ, విద్యార్థినుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది.ఈ ఘటనకు సంబంధించి మణిపూర్ మహిళా కమిషన్‌తో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మణిపూర్ మహిళా కమిషన్‌కు భరోసా కల్పించింది. విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఏపీ మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

# పంటల బీమా నమోదులో

## పీఏసీఎస్ అధ్యక్ష కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి

## -అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.

**అవనిగడ్డ పెన్ పవర్ ఆగస్టు 23**



ప్రతి రైతు సకాలంలో పంటల బీమా చేయించుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రైతు సోదరులకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి పసల్ భీమా యోజన అంశంలో సహకార సంఘాలు చేసిన తప్పిదాలతో ఇన్సూరెన్సు డబ్బులు రైతుల ఖాతాలో జమ కావటం లేదనే భావనతో చాలామంది రైతులు ఈసారి ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లించేందుకు ఆసక్తి చూపటం లేదని కొందరు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి సహకార సంఘాల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతుల ప్రీమియం మొత్తాన్ని సొసైటీ వారు మినహాయించుకుని సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీ వారికి పంపిస్తామని చెప్పి, రైతులకు ఎటువంటి రశీదు ఇవ్వలేదని తెలిసిందన్నారు. ఈ అంశంపై సహకార సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రత్యేక దృష్టితో సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇన్సూరెన్స్ ప్రీమియం గడువు చెల్లించడానికి ఆఖరి తేదీని ఈ నెల 31 వరకు పొడిగించారని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచించారు.

# ధరల పట్టిక మాటే లేదు..
# చికెన్ షాపుల్లో ఇష్టారాజ్యం

- శ్రావణమాసం పేరుతో మాంసం ప్రియులకు 'కుచ్చుటోపి'
- దుకాణాల ముందు ధరల వివరాలు కనిపించకపోవడంతో వినియోగదారుల ఆగ్రహం
- అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు.. అధికారుల తనిఖీలు ఏవీ?
- నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ప్యాపిలి,(పెన్ పవర్):**
పట్టణంలోని 10 చికెన్ దుకాణాలలో ధరల పట్టికలు వినియోగదారులకు కనిపించకుండా చికెన్ విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రావణమాసాన్ని ఆసరాగా చేసుకుని మాంసం ప్రియుల నుంచి ఇష్టారాజ్యంగా ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. చికెన్ దుకాణాల వారు సిండికేట్ గా ఏర్పడి విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ధరల పట్టికను దుకాణాల ముందు స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉన్నప్పటికీ, దుకాణాల్లో అది కనిపించకపోవడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ధర ఎంత? ఎందుకు ఇంత వసూలు చేస్తున్నారనే ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ.?**
చికెన్ దుకాణాలలో ధరల పట్టికలు, తూకాల్లో పారదర్శకత, వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ధరలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.




నిబంధనలు ఉల్లంఘిస్తున్న షాపులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**త్వరలో మీ ముందుకు మరిన్ని కథనాలతో**

# ప్రిస్క్రిప్షన్ లేకుండా హెచ్ వన్, ఎన్ ఆర్ ఎక్స్ విక్రయాలు వద్దు






**ఆళ్లగడ్డ పెన్ పవర్ ఆగస్ట్ 23**
నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ప్రభుత్వ గుర్తింపు పొందిన డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే హెచ్ వన్, ఎన్ ఆర్ ఎక్స్ డ్రగ్స్ ను మెడికల్ స్టోర్ వారు విక్రయించాలని నంద్యాల డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న సూచించారు. ఆళ్లగడ్డ మరియు చాగలమర్రి పట్టణ మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ స్టోర్లలో మందుల విక్రయాలలోపాటించాల్సిన నిబంధనలు, సలహాలు, సూచనలను వివరించారు. హెచ్ వన్, ఎన్ఆర్ఎక్స్ కేటగిరీ మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అస్సలు విక్రయించరాదు అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. ప్రతి బిల్లును, స్టాక్ రిజిస్టర్ ను సరిగా నిర్వహించాలిఅన్నారు. గడువు ముగిసిన మందులను విక్రయించరాదన్నారు. షాపులో లైసెన్స్ బోర్డు కనిపించేలా ఉంచాలన్నారు. అనంతరం ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎన్నికైన విజయభాస్కర్ ను, డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న ను ఆళ్లగడ్డ మరియు చాగలమర్రి పట్టణ మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ విజయభాస్కర్ మాట్లాడుతూ రిజిస్టర్డ్ ఫార్మాసిస్టులకు ఎటువంటి రెన్యూవల్స్ మరియు రిజిస్ట్రేషన్ ఇబ్బందులు, సమస్యలు ఉన్నా ధైర్యంగా పరిష్కరించడానికి కృషి చేస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్ర ,నాగేంద్ర తదితర ఆళ్లగడ్డ మరియు చాగలమర్రి మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# వేనాటి దంపతుల చేతుల మీదుగా
## దేవతామూర్తుల విగ్రహ శిలా ప్రతిష్ట



**దొరవారి సత్రం: పెన్ పవర్, ఆగస్టు 23**
వేనాటి సోదరుల్లో ఒకరైన చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు, టిటిడి బోర్డు మాజీ చైర్మన్, రేనాటి రామచంద్రారెడ్డి దంపతుల చేతుల మీదుగా ఆదివారం వారి స్వగ్రామమైన మా విళ్ళపాడులో శాస్త్రోక్తంగా దేవతమూర్తుల విగ్రహ శిలా ప్రతిష్ట కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. గ్రామ దేవత గుంట కమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగింది. ముందుగా గ్రామంలోని పోలేరమ్మ గుడి వద్ద ఆచారం ప్రకారం అంబళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేనాటి రామచంద్రారెడ్డి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన గుంటకమ్మ, నాగర పమ్మ, పోతురాజు విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవాడ నగరం నుండి వచ్చిన వేద పండితులు ఆధ్వర్యంలో, వేద మంత్రోచ్చారణల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు, వారి ఆహ్వానం మేరకు హాజరైన ప్రముఖులు దేవత మూర్తుల పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వేద పండితుల ఆశీర్వాదాలు పొందారు. వచ్చిన వారికి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆదివారం వేనాటి కుటుంబం నిర్వహించిన పవిత్ర కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# బెస్తపల్లిలో అంగరంగ వైభవంగా మండల పూజ.



**రొంపిచర్ల పెన్ పవర్ ఆగస్టు 23**
రొంపిచర్ల మండలం మోటు మల్లెల బెస్తపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం రాత్రి మండల పూజను వైభవంగా నిర్వహించారు. అర్చకులు కలశ పూజలు, హోమాలు, అభిషేకాలు చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. భజనలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. భక్తుల గోవిందా, జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# స్వర్గంథామం నందు 10 లక్షల విలువైన
## వైకుంఠ రథంను లాంఛనంగా ప్రారంభించిన గోళ్ళ రాజేష్..




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 23**
పది లక్షల రూపాయలతో కొత్త వైకుంఠ రథాన్ని ఆగస్టు 23వ తేదీ ఆదివారం స్వర్గధామ సభ్యులు మరియు పట్టణ ప్రజల సమక్షంలో వైకుంఠ రథం ప్రారంభించారు..
నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో గోళ్ళ రాజేష్ కు ఘణసత్కారం..
ఎన్ని అనాథ శవాలైనా వాటి ఖననాలకు అయ్యే ఖర్చు, సంవత్సరం వరకు ఎన్ని అనాథ శవాలనా ఖర్చు మొత్తం నేనే చెల్లిస్తా .. గోళ్ళ రాజేష్..
నంద్యాల పట్టణంలోని స్థానిక హరిజన పేట నుండి భీమవరం వెల్లే దారిలోని స్వర్గథామం హిందూ స్మశాన వాటికలో పది లక్షల విలువైన వైకుంఠ రథంను లాంఛనంగా ప్రారంభించారు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త గోళ్ళ రాజేష్
ఈ కార్యక్రమంలో ప్రముఖ ఈ.ఎన్.టి స్పెషాలిటీ వైద్యులు నవనిర్మాణ సమితి అధ్యక్షులు డా.మధుసూథన్ మాట్లాడుతూ నంద్యాలలో హిందూ స్మశాన వాటికలను నవనిర్మాణ సమితి పునరుద్ధరించి నిర్వహిస్తోందని ఎంతో మంది సహాయ సహకారాలతో స్వర్గథామంను కొనసాగిస్తున్నామని మృతదేహాలను ఇంటి నుంచి స్మశానవాటికకు తీసుకెళ్లడానికి వైకుంఠ రథాల అవసరం ఉందన్న విషయం గుర్తించి గోళ్ళ రాజేష్ దృష్టికి తీసుకొని వెల్లడం జరిగిందని అదేవిదంగా గోళ్ళ రాజేష్ వెంటనే సానుకూలంగా స్పందించి ఉంటనే దాదాపు పదిలక్షల రూపాయల విరాళం ప్రకటించారని వెంటనే షాక్ అయ్యామని కనీసం ఊహించలేదని ఎవరూ కూడా నవనిర్మాణ సమితి ఏర్పాటు చేసి ఇన్ని సంవత్సరాలు అయినా ఇంతపెద్ద మెత్తం చెల్లించలేదని నవనిర్మాణ సమితి సభ్యులు సైతం పేర్కొన్నారు. గోళ్ళ రాజేష్ యొక్క ఇంతటి సేవా దృక్పథం, సేవానిరతిని గుర్తించి డా.మధుసూథన్ రావు తో పాటు నవనిర్మాణ సమితి సభ్యులు గోళ్ళ రాజేష్ ను అభినందిస్తు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ మృతదేహాల దహన ఖర్చులను భరిస్తానని, అనాధ శవాలయాలకు కూడా సహాయం అందిస్తానని వాగ్దానం చేశారని డా.మధుసూథన్ రావ్ గుర్తు చేశారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రావు, పాదర్తి శేషు బాబు, కశెట్టి కృష్ణమూర్తి, ఎయిర్టెల్ శ్రీనివాస్, ద్వారకా వసంతు, రావినూతల దుర్గాప్రసాద్, గాంధీ, బొగ్గరపు సత్యనారాయణ, సముద్రాల పాండురంగయ్య, కొమ్మ హరి, నెరవాటి మధు తదితరులు పాల్గొన్నారు.




# వైయస్సార్ నగర్‌లో విస్తృత కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్...



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 23**
శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ముందస్తు నేరాలను అరికట్టడం, అలాగే చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీస్ తెలిపారు.
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నంద్యాల సబ్ డివిజన్ ఎస్పి సుస్మిత, ఐపీస్ సూచనలతో తాలూకా యు.పి.ఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైయస్సార్ నగర్ లో నేటి తెల్లవారుజామున పోలీస్ అధికారులు విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు అనుమానితుల ఇళ్లు, అనుమానాస్పద ప్రాంతాలు, రౌడీషీటర్ల నివాసాలు, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అదేవిధంగా, వైయస్సార్ నగర్ మరియు పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలపై ప్రత్యేకంగా పరిశీలన నిర్వహించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రజలకు అవగాహన కార్యక్రమంకార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ అనంతరం స్థానిక ప్రజలతో పోలీస్ అధికారులు సమావేశం నిర్వహించి పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.
ముఖ్యంగా?
1. సైబర్ నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటం. 2. మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.
3. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక చట్టాలు, భద్రతా చర్యలు.
4. శక్తి యాప్ వినియోగం మరియు మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందే విధానం.
5. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం.
6. ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల నేరాలు, వాటి పట్ల ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు.
7. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించడం.
8. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ, తమ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు.
నేరాల నియంత్రణ, ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణే నంద్యాల జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రజల సహకారంతో అసాంఘిక కార్యకలాపాలపై మరింత కఠినంగా చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు తెలిపారు.

# అక్కర పాకలో ఉచిత వైద్య శిబిరం

**దొరవారి సత్రం : పెన్ పవర్, ఆగస్టు 23**
దొరవారి సత్రం మండల పరిధిలోని అక్కరపాక గ్రామంలో ఆదివారం సూళ్లూరుపేటలో నెలకొన్నఎస్ ఎస్ కె గ్లోబల్ డయాబెటిక్ సెంటర్ హాస్పటల్ యాజమాన్యంఉచిత వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రముఖ డయాబెటిస్ వైద్యులు మధుమేహం వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. మధుమేహం వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలు, అనుమానాలు, వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా ప్రాథమిక దశలో వ్యాధి లక్షణాలు గురించి వివరించారు. ప్రధానంగా దినసరి మనం ఆహారంలో తీసుకొని పదార్థాలను బట్టికొంత శాతం వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు అన్నారు. తేలికపాటి వ్యాయామం నడక కూడాడయాబెటిస్ రోగులకు అవసరమని వివరించారు. చిరు వ్యాధులతోపాటు, సాధారణ వ్యాధిగ్రస్తులను కూడా పరీక్షించి మందులు సరఫరా చేశారు. ప్రతి మనిషి రోగం సోకినప్పుడుమనో ధైర్యం కలిగి చికిత్స తీసుకోవాలే తప్ప, ఆందోళనకు గురి కాకూడదని తెలియజేశారు. ఉచిత కార్యక్రమాన్ని బిజెపిపార్టీ నాయకుడు, బాలాజీ, మరికొందరు యువకులు సారధ్యంలో ఏర్పాటు చేశారు.